క్లుప్తంగా

పాఠశాల పరిశీలన



బోధనను పరిశీలిస్తున్న అధికారి

ములుగు(గజ్వేల్): జాతీయ సాధన సర్వేలో భాగంగా ములుగు మండలం ఆర్అండ్ఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను న్యూఢిల్లీకి చెందిన ఎన్సీఆర్టీ అసిస్టెంట్ ప్రొఫెసర్, జాతీయ స్థాయి పరిశీలనాధికారి డాక్టర్ దర్శన్ సందర్శించారు. సమన్వయ అధికారి భాస్కర్ పర్యవేక్షణలో గురువారం ఆయన పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠశాలలో స్వచ్ఛత, తరగతిగది నిర్వాహణ, బోధనతీరు, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాలలోని సౌకర్యాల కల్పనపై విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయభాస్కర్‌రెడ్డి, నోడల్ అధికారి రవికుమార్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆ పట్టాలను రద్దుచేయండి



ధర్నా చేస్తున్న సంఘం సభ్యులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని పోసాన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిని కొందరు తమ పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, వాటిని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ మండల గంగపుత్రుల సంఘం నేతలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనెంబర్ 192లో ఉన్న తమ పూర్వీకుల భూమిని తెలుగుదేశం హయాంలో ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వానికి ఇచ్చామన్నారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు కొంత స్థలాన్ని తహసీల్దార్ సమక్షంలో తమ పేరు మీద మార్చుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఆర్టీఐ చట్టంకింద సంబంధిత అధికారులను సమాచారం అడిగినా వారిలో స్పందన లేదని వాపోయారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారి డ్యాక్యుమెంట్లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

ప్రజావీరుడు పండుగ సాయన్న



నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్: నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ పేదలకు గూడు, గుడ్డను అందించిన ప్రజావీరుడు సాయన్న అని కొనియాడారు. కార్యక్రమంలో కొమురయ్య, శ్రీనివాస్, రవి, సుందరయ్య, శ్రీనివాస్, బైరి శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

అందెలో మాక్ పోలింగ్



క్యూ కట్టిన విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన కలిగించడానికి మండల పరిధిలోని అందె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచర్లు విద్యార్థులకు గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. కొందరు విద్యార్థులు సర్పంచ్, వార్డు సభ్యులుగా బరిలో నిలిచారు. పాఠశాలలోని విద్యార్థులు ఓటును వినియోగించుకోవడానికి బారులు తీరి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం విద్యార్థులు వేసిన ఓట్లను లెక్కించారు. మెజార్టీతో గెలిచిన అభ్యర్థులను ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఏవిధంగా జరుగుతాయో, ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే విధి విధానాలపై టీచర్లు విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాములు, టీచర్లు అంజుకుమార్, శ్రీనివాస్‌చారి, విష్ణులింగం, శ్రీధర్, ఇందిరాబాయి, యాదగిరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యుత్ షాక్‌తో ఓ గేదె మృతి చెందిన ఘటన మండలంలోని అనంతసాగర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బీమారి చంద్రయ్యకు చెందిన రెండు గేదెలు పొలంలో మేత మేస్తున్న క్రమంలో విద్యుత్‌వైర్లు తగలడంతో ఓ గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

నిర్లక్ష్యంగా ఉంటే సహించం

- సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం: ఆర్డీఓ
- సమస్యలు తలెత్తకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

అక్కన్నపేట(హుస్నాబాద్): మంత్రి ఇలాకాలో పని చేస్తున్నామనే బాధ్యత, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఆర్డీఓ రామ్మూర్తి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు ప్రభుత్వ ఉద్యోగులెవరైనా విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని, ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని సూచించారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయితీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా లీకేజీలను నివారిస్తూ సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని, అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కోరారు.

స్థలాలను గుర్తించాలి

ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాల్లోనే ఉండాలన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని తహసీల్దార్ అనంతరెడ్డిని ఆదేశించారు. ఈ ప్రక్రియ రెండు, మూడు రోజుల్లో పూర్తయ్యేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే కొన్ని భూములను గుర్తించారని.. అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు, పంతుల్‌తండా గ్రామంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ తదితర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థలాలను త్వరగా గుర్తించాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న పోస్టుల జాబితాను అందించాలని ఎంపీడీఓ జయరాంను కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మహేశ్, పంచాయితీ రాజ్ డీఈ మహేశ్, ఎంపీడీఓ భానోతు జయరాం,గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- చేర్యాల సీఐ ఎల్ శ్రీను



కొమురవెల్లి పాఠశాలలో మాట్లాడుతున్న సీఐ

కొమురవెల్లి(సిద్దిపేట)/అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. గురువారం కొమురవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్యాల సీఐ ఎల్ శ్రీను సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని హెచ్చరించారు. మహిళలు వేధింపులకు గురైతే 100గాని 8712667434 నంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాంమూర్తి, హెచ్ఎం తిరుపతి రెడ్డి, హుస్నాబాద్ షీ టీమ్ బృందం, స్వప్న, ప్రశాంతి, కృష్ణ, శికుమార్ తదితరులు పాల్గొన్నారు. అక్కన్నపేట మండలంలోని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్ శాఖకు సహకరించాలని అన్నారు. అక్కన్నపేట మండలం గుబ్బడి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ నేరాల నివారణకు సీసీ కెమేరాలు ఎంతో దోహదపడతాయన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుదాం



డీఐఈఓను సన్మానిస్తున్న అధికారులు

- డీఐఈఓ రవీందర్‌రెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యారంగంలో సిద్దిపేటకు ఓ ప్రత్యేకత ఉందని, సమష్టిగా విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుదామని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. డీఐఈఓగా గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జీజేఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కృష్ణకుమార్, టీజీఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాగేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి నంట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు రవీందర్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు సురేందర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కిషన్, అమరేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, గిరిరవి, నగేశ్, దుబ్బాకరాజు, గంగాధర్, యాదగిరి, రవి పాల్గొన్నారు.

గోనె సంచులను తరలించారు

సాక్షి ఎఫెక్ట్..

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో వృథాగా వదిలేసిన గోనె సంచులను ఎట్టకేలకు అధికారులు ఓ వాహనంలో తరలించారు. 2వ తేదీన సాక్షిలో 'ఎండకు ఎండి...వానకు తడిచి...' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి విశాల పరపతి సహకార సంఘం అధికారులు స్పందించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో వదిలేసిన గోనె సంచులను గురువారం తరలించి సహకార సంఘం గోదాంలో భద్రపరిచారు.



గోనె సంచులను తరలిస్తున్న కార్మికులు

– అక్కన్నపేట(హుస్నాబాద్)

పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి

- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్/సిద్దిపేటకమాన్: పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని సీపీ అనురాధ అన్నారు. కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఏఎస్ఐగా పదోన్నతి పొందడంతో ఆమె గురువారం అభినందించారు. సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో సేవలందించాలని సూచించారు. గౌరారం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన బి.కరుణాకర్‌రెడ్డి సీపీ అనురాధను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.



స్టార్‌ను అలంకరిస్తున్న సీపీ

కోనో చెట్లతో ఆరోగ్య సమస్య



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న కోనో కార్పస్ చెట్లను తొలగించాలని ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ప్రేరణ పాండకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి బాబు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కల్గించే చెట్లను తీసివేయాలన్నారు. పలు రాష్ట్రాలలో కోనో చెట్లు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సదన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని కుక్కల జనన నియంత్రణ యూనిట్(యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)ను గురువారం మున్సిపల్ చైర్మన్ మంజుల, కమిషనర్ ప్రేరణ, వైస్ చైర్మన్ కనకరాజు సందర్శించారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. త్వరితగతిన వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ సతీశ్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు

హుస్నాబాద్: ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారి కోసం అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం, సెంటర్ కో–ఆర్డినేటర్ వాసుదేవరెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 10వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. రెగ్యులర్ పాఠశాలలో చదువుకోలేని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అడ్మిషన్ పొందిన వారికి అక్టోబర్ నుంచి తరగతులు నిర్వహించనున్నామని, మరిన్ని వివరాలకు పాఠశాలలోని సెంటర్ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్లను సంప్రదించాలని, 9490297977 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

విద్యార్థులకు అభినందనలు

కోహెడ(హుస్నాబాద్): తల్లిదండ్రులు, గ్రామానికి విద్యార్థులు మంచిపేరు తీసుకురావాలని ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్సీ ఉత్తీర్ణత సాధించి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన పలువురు విద్యార్థులను గురువారం ఆయన సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎండీ మహమూద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై నాట్లువేసి నిరసన



వరినాట్లు వేస్తున్న గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రంలోని ప్రధాన వీధిలో బీటీ రోడ్డు బురదమయం కావడంతో స్థానికులు వరి నాట్లువేసి నిరసన తెలిపారు. సుమారు మూడేళ్ల కిందట రోడ్డు విస్తరణ పనుల నిర్వహణ కోసం పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.3.40కోట్లు మంజూరయ్యాయి. మాజీ సర్పంచ్ భర్త డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. అయితే మూడేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకలేదు. మరోవైపు గుంతలమయంగా మారిన రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షాలు కురవడంతో గుంతల్లో నీరుచేరి చిత్తడిగా మారింది. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గ్రామ సందర్శనకు వచ్చిన కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం అందించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

స్వచ్ఛదనం అందరి బాధ్యత



చిన్నకోడూరు(సిద్దిపేట): మాచాపూర్‌లో పర్యటిస్తున్న జెడ్పీ సీఈఓ

- జెడ్పీ సీఈఓ రమేశ్

చిన్నకోడూరు(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్/కోహెడ రూరల్(హుస్నాబాద్)/సిద్దిపేటజోన్/హుస్నాబాద్/తొగుట(దుబ్బాక)/జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామాల స్వచ్ఛదనం ప్రజలందరి బాధ్యత అని జెడ్పీ సీఈఓ రమేశ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మండల పరిధిలోని గంగాపూర్, మాచాపూర్, చంద్లాపూర్ గ్రామాల్లో పర్యటించారు. సామూహిక ప్రదేశాల్లో ఇంకుడు గుంతలు గుర్తించడం, ఉపయోగించడంపై అవగాహన కల్పించాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వన మహోత్సవంలో అందరూ భాగస్వామ్యులు కావాలని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, ఎంపీఓ సోమిరెడ్డి, ఏపీఎం కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఏఎస్ఐ ఉమేశ్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. కోహెడరూరల్ మండలంలోని వరికోలు, వింజపల్లి, రాంచంద్రాపూర్, ఎర్రగుంటపల్లిలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మంద ధర్మయ్య మొక్కలు నాటారు. మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, బాలకిషన్, వెంకటస్వామి, జయరాజ్, కనకరెడ్డి, రాకేశ్, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్ తదితరులు ఉన్నారు. హుస్నాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో మున్సిపల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చైర్ పర్సన్ ఆకుల రజిత 15వ వార్డులో నిర్వహించిన జ్వర సర్వే, కుక్కల సర్వేలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. తొగుట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అలాడే జగదేవ్‌పూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో డీఎల్‌పీఓ లత విద్యార్థులకు స్వచ్ఛదనం– పచ్చదనంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిద్దిపేట మన లక్ష్యం

సిద్దిపేటజోన్: ఆరోగ్య సిద్దిపేట లక్ష్యంగా ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్ పేర్కొన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా పట్టణంలోని వివిధ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ప్రేరణ పాండతో కలిసి అవగాహన కల్పించారు. దోమల నియంత్రణ కోసం డ్రైనేజీల్లో ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ రాజనర్స్, కౌన్సిలర్లు ప్రవీణ్, నాగరాజు రెడ్డి, యోగి, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏడో వార్డులో కౌన్సిలర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు వెంటనే చెల్లించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): పాడి రైతుల బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బూర్గోజు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం పాడిరైతుల సమస్యలను పరిష్కరించాలంటూ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రైతులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు గడుస్తున్నా పాడిరైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ప్రతి గ్రామంలో పశువులకు ఆసుపత్రిని ఏర్పాటు చేసి వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు.



వేతన బకాయిలు.. కార్మికుల వెతలు

- పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య



జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

జగదేవ్‌పూర్(గజ్వేల్)/చిన్నకోడూరు(సిద్దిపేట)/కొండపాక(గజ్వేల్): వేతనాలు రాకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జగదేవ్‌పూర్ మండల కార్యాలయం ఎదుట ఆయన ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ మండలంలోని 8గ్రామాల్లో కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు విజయ, బాబు, అనిల్, యాదగిరి, మధు, స్వామి, గంగవ్వ, స్వప్న తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ మృతి చెందిన కార్మికులకు రూ.10లక్షల ఇన్సూరెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కొండపాక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ మండల కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య ఆధ్వర్యంలో కార్మికులు నిరసనకు దిగారు. పంచాయతీ కార్మికులకు నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొమురయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, సాయి కుమార్, మల్లవ్వ, మణెమ్మ, ముత్తయ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతోనే యువకుడు మృతి

హుస్నాబాద్‌రూరల్: పందిల్ల గ్రామానికి చెందిన ఒగలవేని శ్రీనివాస్(29) మద్యానికి బానిసై అనారోగ్యంతో మరణించినట్లు ఎస్ఐ మహేశ్ గురువారం తెలిపారు. గ్రామస్తులు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టులో అనారోగ్యంతోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ వయనాడ్ బాధితుల కోసం విరాళాలు

చేర్యాల(సిద్దిపేట)/సిద్దిపేటఎడ్యుకేషన్: కేరళలోని వయనాడ్ బాధితుల సహాయార్థం పట్టణ కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ ఆధ్వర్యంలో గురువారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి వందల మంది ప్రాణాలు కోల్పోయారని, వారిని ఆదుకోవడం మన బాధ్యత అన్నారు. భూమయ్య, యాదగిరి, మమత, అంజయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్దిపేటకు చెందిన రిటైర్డ్ టీచర్ జాన్‌వెస్లీ రూ.50వేల విరాళం అందించారు. కేరళ సీఎం విపత్తు సహాయ నిధికి ఆన్‌లైన్‌లో అయన ట్రాన్స్‌ఫర్ చేశారు.

◆ విద్యుత్ అంతరాయం

సిద్దిపేటరూరల్: మరమ్మతుల కారణంగా నారాయణరావుపేట మండల పరిధిలోని 33కేవీ జక్కాపూర్ ఫీడర్ సరాఫరా కలిగిన గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్రాలగోంది, గోపులాపూర్, జక్కాపూర్, మాటిండ్ల, మల్యాల గ్రామాలకు ఉదయం 12గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

దుబ్బాకటౌన్/కొండపాక(గజ్వేల్): దుబ్బాక మండలం సూరంపల్లిలో ఓరుగంటి రాజు, కంఠం బాల్‌నర్సు, ముత్యంపేట గ్రామానికి చెందిన జంగం రూపకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. కార్యక్రమంలో బుర్రరాజు గౌడ్, సత్యనారాయణ గౌడ్, ముత్యాల శ్రీనివాస్, బొల్లం స్వామి తదితరులు పాల్గొన్నారు. కొండపాక మండలంలోని రవీంద్రనగర్‌కు చెందిన కుంచెం నితీశ్‌కు రూ.49,500, కొండపాకకు చెందిన ఎల్లవ్వకు రూ.49,500ల చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.

◆ ఉపాధ్యాయురాలికి ఘన వీడ్కోలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రమణ బదిలీపై వెళ్లడంతో గురువారం పాఠశాల ఆవరణలో ఘనంగా వీడ్కోలు పలికారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న ఆమెను విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, హెచ్ఎం తిరుపతి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ మృతుడి కుటుంబానికి సాయం

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల కురుమసంఘం సభ్యుడు బట్టు ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం సంఘం అధ్యక్షుడు సంతోష్ కుమార్ ఆ కుటుంబాన్ని పరామర్శించారు. 50కిలోల బియ్యం, నగదు అందజేశారు. అలాగే గోనెపల్లిలో జంగిటి రమేశ్ తల్లి వెంకటవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో అతడి మిత్రులు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు.

◆ పూసల కులాన్ని ఆదుకోవాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): సంచార జాతుల కులమైన పూసల కులాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిద్దిపేట జిల్లా పూసల సంఘం అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం కోరారు. మండలంలోని తంగళ్లపల్లిలోని కిష్టస్వామి గుట్ట ఆవరణంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ జాబితాలలో పూసల కులాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుర్గేశం, నర్సింహులు తదితరులు ఉన్నారు.

◆ ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఎన్నిక

చేర్యాల(సిద్దిపేట): ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా మైసంపల్లి రాహుల్, కార్యదర్శిగా తాడూరి భరత్‌కుమార్ ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, రాకేశ్‌రెడ్డి, అరవింద్, మధు, ప్రశాంత్, విక్రం, రాజు, హారిక పాల్గొన్నారు.

◆ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లోనూ రాణించాలని ప్రముఖ విద్యావేత్త సత్యం సూచించారు. నల్గొండ జిల్లా నకిరేకల్ పట్టణంలో జరిగిన 38జాతీయ షోటో కాన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో శ్రీవాణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. గురువారం వారిని పాఠశాలలో ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ ఆ రైతులకు రుణమాఫీ కాలే ..

దుబ్బాక: బీఆర్ఎస్ హయాంలో అసైన్డ్ భూములు కల్గి ఉన్న రైతులకు రుణమాఫీ జరుగలేదని ఈ విషయాన్ని గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి అసైన్డ్ రైతులకు మాఫీ చేయడం చాలా సంతోషకరమని పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కాల్వ నరేశ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ దళితులకు ఎక్కువ శాతం అసైన్డ్ భూములు ఉన్నాయన్నారు.